
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.4 । కనిష్ఠం 23.8
కామారెడ్డి జిల్లా వార్తలు
5
శనివారం 13 ఏప్రిల్ 2024



అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

బాన్సువాడటౌన్, ఏప్రిల్12: భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించుకోవాలని మహనీయుల ఉత్సవ కమిటీ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని రాజారాం దుబ్బలో జయంతి ఉత్సవాల గురించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నాయకుడు సంతోష్ మాట్లాడుతూ ఈనెల 14న అంబేడ్కర్ జయంతిని నిర్వహించుకుందామన్నారు. కార్యక్రమంలో మహనీయుల ఉత్సవకమిటీ నాయకులున్నారు.

ప్రచారంలో.. దూకుడు

- దూకుడు పెంచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- పోటాపోటీగా నాయకుల సభలు, సమావేశాలు
- ప్రజల మద్దతు కోసం కార్యక్రమాలు
- ఓటర్లను ఆకర్షించేందుకు వాగ్దానాలు
- వారం రోజుల్లో వెలువడనున్న నోటిఫికేషన్
- గెలుపు కోసం అన్ని పార్టీల కసరత్తు



కామారెడ్డిలో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి, నాయకులు (ఫైల్)



కామారెడ్డిలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు (ఫైల్)



కామారెడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బరిలో నిలిచిన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. ఎన్నికల ప్రచారంపై దూకుడు పెంచుతున్నారు. మరో వారంరోజుల్లో నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలు వేగవంతం చేస్తారు. గత కొద్దిరోజులుగా క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తూ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు దూకుడు పెంచారు. వేసవి ఎండలను లెక్కచేయకుండా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కామారెడ్డి, ఎల్లారె డ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో కలియతిరుగుతున్నారు. పెళ్లిళ్లు, ఫంక్షన్‌లు, విందులు, శుభకార్యాలు, పండుగలు హాజరవుతున్నారు. ఎండా కాలంలోనూ రోజంతా తీరిక లేకుండా గడిపేస్తున్నారు.

కాంగ్రెస్‌కు ఎమ్మెల్యే బలం

జహీరాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్ షెట్కార్ బరిలో ఉండనున్నారు. ఈ లోక్‌సభ పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఇందులో ఎల్లారెడ్డి, జుక్కల్, నారాయణఖేడ్, ఆందోల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు.ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే బలం కానున్నారు. దీంతోపాటు మిగితా నియోజకవర్గాల్లోను షబ్బీర్‌అలీ, ఏనుగు రవీందర్ రెడ్డి లాంటి బలమైన నేతలు ఉండడం కాంగ్రెస్‌కు కలిసి రానుంది. వీరంతా షెట్కార్ గెలుపుకోసం కలిసి కట్టుగా పనిచేస్తే కాంగ్రెస్ ఖాతాలో జహీరాబాద్ ఎంపీ సీటు పడడం ఖాయం. ఇదే క్రమంలో అభ్యర్థి సురేష్ షెట్కార్ పార్టీ కార్యకర్తలు,నాయకుల్లో ఉన్న అసంతృప్తి బయటపడకుండా జాగ్రత్త పడుతున్నారు. వ్యతిరేకంగా ఉన్న పలు సామాజిక వర్గాలను బుజ్జగిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఎల్లారెడ్డి, జుక్కల్,బాన్సువాడ నియోజకవర్గాల్లో మంత్రి దామోదర్ రాజనర్సింహ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకుల సన్నాహక సమావేశాలు నిర్వహించారు. అంతకముందే సీఎం రేవంత్‌రెడ్డితో లోక్‌సభ నియోజకవర్గ ముఖ్యనేతలతో సమావేశమై ఎన్నికల్లో పాటించాల్సిన వ్యూహాలపై చర్చించారు. శుక్రవారం సైతం జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఎన్నికలపై చర్చించినట్లు తెలిసింది. ఎన్నికల నోటిఫికేషన్ అనంతరం కాంగ్రెస్ ప్రచారాన్ని మరింత వేగవంతం చేయనున్నట్లు తెలుస్తోంది.

వ్యూహాత్మకంగా బీఆర్ఎస్

బీఆర్ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్‌ను ప్రకటించినప్పటి నుంచే ఆ యన ఎన్నికల రణంలోకి దిగారు. తమ పార్టీ నాయకులు వేరే పార్టీలోకి చేరుతున్నప్పటికీ పాత పరిచయాలు ఇక్కడి పరిస్థితులను బేరీజు వేసుకుంటూ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల సహకారంతో ముందుకు సాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలు రైతు సమస్యలపై నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. గ్రామాలు, పట్టణాలు, కార్మిక క్షేత్రల్లోనూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. నియోజక వర్గాల వారిగా సన్నాహక సమావేశాలలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో పాల్గొంటున్నారు. ఈ సమావేశాలకు ఇటీవల ఎమ్మెల్యే హరీష్‌రావు హాజరై గాలి గెలుపు కోసం కార్యకర్తలను సన్నద్ధం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతి నిధులు పార్టీ నేతలతో గెలుపుకోసం ప్రణాళికలు వేస్తున్నారు. కాంగ్రెస్‌లో ఉన్న వర్గపోరు తమకు కలిసి వస్తుందనే నమ్మకంతో ఉన్నారు.

దూకుడుగా బీజేపీ

జహీరాబాద్ స్థానాన్ని ఎలాగైన కైవసం చేసుకోవాలని కమలం పార్టీ నాయకులు విస్తృతంగా ప్రయత్నాలుచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న బీబీపాటిల్‌ను బీజేపీలో చేర్చుకుని అధిష్ఠానం ఆయనకే టికెట్ కేటాయించిన విషయం తెలిసిందే. బీబీపాటిల్ ఇప్పటికే ఎన్నికల ప్రచారంలో బీజీగా గడుపుతున్నారు. అయితే నియోజక వర్గాల్లో ఇప్పటికీ నాయకత్వం లేమి ఉండడంతో సంస్థగతంగా బలపడేందుకు చమటోడుస్తున్నారు. ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా ఆ పార్టీ నాయకులతో కార్యక్రమాలు చేపడుతూ దూకుడుగా ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులను పార్టీలో చేర్చుకుంటు న్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పథకాలు, కార్యక్ర మాలపై ప్రచారం చేస్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ చరిష్మను వాడుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై విమర్శలు చేస్తున్నారు. ఈ మేరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. కమల నాథుల్లో ఉత్సాహాన్ని నింపి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటేందుకు ప్రయత్నిస్తున్నారు.



బిచ్కుందలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న దామోదర రాజనర్సింహ (ఫైల్)



కొత్త ఓటరు నమోదుకు మూడు రోజులే గడువు

- అవకాశం కల్పించిన కేంద్ర ఎన్నికల కమిషన్
- వచ్చే దరఖాస్తులన్నీ పరిశీలించి అనుబంధ జాబితాలో అవకాశం ఇవ్వనున్న అధికారులు



నిజామాబాద్, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న జిల్లా అధికారులు ఓటరు నమోదుపై దృష్టిపెట్టారు. నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు నామినేషన్ల స్వీకరణకు ఇప్పటికే చర్యలు చేపట్టిన అధికారులు ఇంకా మూడు రోజులే నమోదుకు సమయం ఉండటంతో యువతకు అవగాహన కల్పిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల ఆధారంగా ఓటరు నమోదుకు చర్యలు చేపడుతున్నారు. ఈనెల 15 వరకు ఓటరు నమోదు దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ఈనెల 25న అనుబంధ జాబితాను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ పూర్తి చేయడంతో పాటు కొత్త ఓటర్ల ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. పూర్తిస్థాయిలో నమోదు కొనసాగించడంతో పాటు ఈనెల 25లోపు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కొత్త ఓటర్లకు అవకాశం కల్పించే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు.

• ఎన్నికల ఏర్పాటల్లో అధికారులు

పార్లమెంట్ ఎన్నికల కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పార్లమెంట్ పరిధిలోని 1807 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు. ఈనెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణకు సిద్ధమవుతున్నారు. కేంద్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 8న ఓటర్ల జాబితాను ప్రకటించారు. ఆ జాబితా అనుగుణంగా ఎన్నికలకు ఏర్పాట్లను చేస్తున్నారు. కేంద్ర ఎన్నికల కమీషన్ కొత్తఓటర్లు నమోదు చేసుకునేందుకు ఈనెల 15వరకు అవకాశం కల్పించింది. ఆలోపు బూత్‌స్థాయిలో బీఎల్‌వోలు, తహశీల్దార్లు, ఆర్‌డీవో కార్యాలయాల్లో ఓటరు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఓటరు జాబితాలో ఇప్పటి వరకు పేరు లేని వారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. కొత్త ఓటర్లు నమోదు చేసుకునేందుకు కూడా అవకాశాన్ని ఇచ్చారు. యువ ఓటర్ల ప్రాతినిధ్యం పెంచేందుకు కేంద్రఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకొని ఈ అవకాశాన్ని కల్పించింది. దరఖాస్తు చేసుకునేందుకు మరో మూడు రోజులే సమయం ఉంది. సోమవారంలోపు వచ్చిన దరఖాస్తులన్నీ పరిశీలిస్తారు. ఈనెల 25లోపు దరఖాస్తులన్నీ స్క్రుటిని చేసి అర్హులైన వారి అందరికీ ఓటుహక్కు కల్పిస్తారు. ఈనెల 25న అనుబంధ జాబితాను ప్రకటించనున్నారు. ఈ అనుబంధ జాబితాకు అనుగుణంగా ఓటరు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తారు. కేంద్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఇప్పటికే పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసిన అధికారులు ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వాటిని ఏరోజుకు ఆరోజు పరిశీలిస్తూ పరిష్కరిస్తున్నారు. ఇప్పటి వరకు జాబితాలో లేనివారికి అవకాశం కల్పిస్తున్నారు. గత శాసనసభ ఎన్నికలకంటే ఇప్పటికే 40వేల మంది ఓటర్లు పెరగగా కొత్తగా ఇచ్చిన ఈ గడువు వల్ల మరికొంత మంది ఓటర్లు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ ఓటరు నమోదుపై జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఆదేశాలను జారీ చేస్తున్నారు. ఓటరు నమోదు సజావుగా జరిగే విధంగా చూస్తున్నారు. ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లను స్వీకరించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. ఓటరు జాబితా నమోదుతో పాటు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, ఉద్యోగులకు శిక్షణ వంటి అంశాలను పర్యవేక్షిస్తున్నారు. నామినేషన్లు స్వీకరించిన తర్వాత పూర్తిస్థాయిలో పోలింగ్‌పై దృష్టిపెట్టను న్నారు.

సీఎంతో సమీక్షలో పాల్గొన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



సీఎంకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న దృశ్యం

పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతోగెలిపించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని జహీరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పాల్గొన్నారు.

• ఎల్లారెడ్డి

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

• మూడు రోజుల్లో రిపోర్టు వచ్చే అవకాశం • రిపోర్టు ఆధారంగా తదుపరి చర్యలు

బీర్కూర్, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో గ్రోమోర్ కేంద్రంలో వరి విత్తనాలు కొనుగోలు చేసి పంటలు పండించిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. గ్రోమోర్ కేంద్రం వారు నకిలీ విత్తనాలు అంటగట్టి తమను నిండా ముంచారని రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివిధ వ్యవసాయ పరిశోధన కేంద్రాలకు చెందిన శాస్త్రవేత్తలు శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రానికి వచ్చి పంటలను పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో కలిసి వారు బాధిత రైతుల పంటలను పరిశీలించారు. ఒక్కొక్క శాస్త్రవేత్త ఒక్కో విభాగానికి చెందినవారు కావడంతో వారు అన్నికోణాల్లో పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంటలకు ఏయే ఎరువులు, మందులు వాడారు. సాగునీరు సరిగ్గా అందించారా, దోమలు, తెగుళ్ల ఏమైనా వచ్చాయా, వాతావరణ పరిస్థితులు తదితర విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. పొంట పొలాల్లో వరి పంట శాంపిళ్లను సేకరించి తమతో పాటు తీసుకెళ్లారు. రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని బాన్సువాడ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వీరస్వామి తెలిపారు. క్షేత్ర పరిశీలన చేసిన వారిలో కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రానికి చెందిన సీనియర్ వరి సైంటిస్టు డాక్టర్ శ్రీధర్‌సిద్ధి, బాధిత రైతులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చైర్‌పర్సన్ పీఠంపై మూడు పార్టీల కన్ను!

- ఈనెల 15న కామారెడ్డి చైర్‌పర్సన్ ఎన్నిక
- చైర్‌పర్సన్ పీఠం దక్కించుకునేందుకు మూడు పార్టీల అభ్యర్థుల పోటీ
- అవిశ్వాసంలో పడిన తప్పులను సరిదిద్దుకునే పనిలో బీఆర్ఎస్
- ఇప్పటికే క్యాంపునకు తరలిన కాంగ్రెస్ కౌన్సిలర్‌లు
- పీఠాన్ని కైవసం చేసుకునేందుకు బీజేపీ పావులు



కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 12: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక రోజుకో రకంగా మలుపులు తిరుగుతోంది. గత రెండు నెలల నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం పైనే రాజకీయం రంజుగా నడుస్తుండడంతో మున్సిపల్‌లోని అన్ని వార్డుల్లో ఇదే చర్చ పెద్దఎత్తున చోటుచేసుకుంటుంది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్ నిట్టుజాహ్నవిని అవిశ్వాసంతో పదవి నుంచి దించివేసి కాంగ్రెస్ చైర్‌పర్సన్ పదవిని దక్కించుకునేందుకు అనేక ప్రయత్నాలుచేస్తు వచ్చింది. కాంగ్రెస్ ఆశలపై నీళ్లు చల్లేలా బీజేపీ తన రాజకీయ చతురతను ప్రదర్శిస్తు చైర్‌పర్సన్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు పావులు కదుపుతూ వస్తోంది. ఈ క్రమంలో ఈ రెండు పార్టీల మధ్య ఎవరు చైర్‌పర్సన్ అవుతారనే చర్చజరుగుతున్న సమయంలో అనుహ్యంగా గత రెండురోజుల నుంచి బీఆర్ఎస్ చైర్‌పర్సన్ పదవిపై మళ్లీ కన్నేసింద ని వార్తలు గుప్పుమంటున్నాయి. అందుకు తగ్గట్టుగా ఒకరిద్దరు చైర్‌పర్సన్‌కు పోటీపడేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. కాగా ఎన్నికల కమీషన్ చైర్‌పర్సన్ ఎన్నికకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేయగా ఈనెల 15న ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఒకవేళ 15న ఎన్నిక జరగకపోతే 16న నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. అందుకు సంబంధించి అన్నివార్డుల కౌన్సిలర్‌లకు ఆర్‌డీవో రంగనాథ రావు ఈనెల 10తోపాటు 12న మరోమారు నోటీసులు సైతం పంపించారు.

బీఆర్ఎస్ సైతం చైర్‌పర్సన్ రేసులో..

గతంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నిట్టుజాహ్నవి కామారెడ్డి మున్సిపల్‌చైర్‌పర్సన్‌గా ఎన్నికైంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలు రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ చైర్‌పర్సన్‌పై కాంగ్రెస్ కౌన్సిలర్‌లు అవిశ్వాసం ప్రకటించారు. అవిశ్వాసానికి 34 మంది కౌన్సిలర్‌లు కావాల్సి ఉండగా కాంగ్రెస్ వద్ద 27 మంది కౌన్సిలర్‌లు మాత్రమే ఉన్నారు. దీంతో బీఆర్ఎస్‌లోని పదిమంది కౌన్సిలర్‌ల మద్దతు తీసుకుని బీఆర్ఎస్ చైర్‌పర్సన్ నిట్టుజాహ్నవిని పదవి నుంచి కాంగ్రెస్ కౌన్సిలర్‌లు దించివేశారు. అవిశ్వాసంతో కాంగ్రెస్ ఆశలు ఫలించినప్పటికి సొంత పార్టీ చైర్‌పర్సన్‌ను దించేందుకు బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌కు మద్దతు పలకడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతూ వచ్చాయి. ఏకంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రెస్‌మీట్ పెట్టిమరి బీఆర్ఎస్ కౌన్సిలర్‌ల తీరుపై విమర్శలు వ్యక్తం చేశారు. పైగా అవినీతి మరకలు లేని ఏ పార్టీ కౌన్సిలర్‌లకైన తాను మద్దతు ప్రకటిస్తానని తెలిపారు. ఈ నేపథ్యంలో తమపై పడిన మరకలను తొలగించుకునే పనిలో పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు ముఖ్య నేతలతో చర్చజరిపి వారు సైతం చైర్‌పర్సన్ రేసులో ఉండేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. దీంతో బీఆర్ఎస్ సైతం గత రెండురోజుల నుంచి మళ్లి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సమాచారం.ఇందులో ముఖ్యంగా మాడురి అనుష ప్రసన్నకుమార్,గెరిగంటి స్వప్న లక్ష్మీనారాయణలు చైర్‌పర్సన్ రేసులో ఉండగా బీఆర్ఎస్ పెద్దలు ఎవరినో ఒకరిని చైర్‌పర్సన్‌గా నిలిపే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే బీఆర్ఎస్‌లో మొత్తం 16మంది కౌన్సిలర్‌లు ఉండగా వీరిలో ఎంతమంది సొంతపార్టీ చైర్‌పర్సన్ అభ్యర్థికి సహకరిస్తారు.. బీజేపీ ఏ మేర తన నిర్ణయం ప్రకటించబోతుందనేది వేచిచూడాలి.

క్యాంపునకు తరలిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్‌ను పదవినుంచి దించేశామని ఇక తమ పార్టీలోనే ఎవరికో ఒకరికి చైర్‌పర్సన్ పదవి దక్కుతుందని ఆశపడిన కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్‌లకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి మళ్లి చైర్‌పర్సన్ రేసులో వేరే వ్యక్తులు పోటికి దిగుతుండడంతో సందిగ్ధంలో పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. కాంగ్రెస్‌పార్టీలో చైర్‌పర్సన్ పదవికి పోటి పడుతున్న వారిలో ఒకరి అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ కౌన్సిలర్‌లు అసంతృప్తి వ్యక్తం చేయడంతోపాటు ఇతర పార్టీల వైపు చూస్తారనే భయం నెలకొందని తెలుస్తోంది. దీంతో గత రెండురోజుల క్రితం పలువురు కౌన్సిలర్‌లను క్యాంపునకు తరలించగా మరికొంతమంది కౌన్సిలర్‌లను ఈ రెండురోజుల్లో తరలించేందుకు కాంగ్రెస్ నాయకులు ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎట్టిపరిస్థితుల్లో చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించునేందుకు, పార్టీ కౌన్సిలర్‌లు చేజారకుండా పగడ్బంది చర్యలు తీసుకుంటుందని సమాచారం. అందులోభాగంగానే అవిశ్వాసం సమయంలో గోవాకు క్యాంపు తరలిన కౌన్సిలర్‌లు ప్రస్తుతం మరోమారు హైదరాబాద్‌కు క్యాంపుకు తరిలారు. ప్రస్తుతంకాంగ్రెస్ కౌన్సిలర్‌లు 27 మంది ఉండగా ఇందులో కొందరు కౌన్సిలర్‌లు ఇతర పార్టీల వైపు చూస్తున్నట్లు సమాచారం. చైర్‌పర్సన్ ఎన్నికకు 26మంది కావాల్సి ఉండగా ఎవరైన ఇతర పార్టీల వైపు వెళ్తె కాంగ్రెస్ ఇన్నిరోజులు పడిన కష్టం వృధా అయినట్లేననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

పావులు కదుపుతున్న బీజేపీ

మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టుజాహ్నవిపై అవిశ్వాసం పెట్టి ఆమెను పదవి నుంచి దించేవరకు స్తబ్ధంగా ఉన్న బీజేపీ అనూహ్యంగా తెరమీదకు వచ్చి చైర్‌పర్సన్ పీఠంపై కాంగ్రెస్ పెట్టుకున్న ఆశలకు చెక్‌పెట్టెలా చర్యలు చేపడుతూ వస్తోంది. కామారెడ్డి మున్సిపల్ చరిత్రలో ఏనాడు ఏ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టి దించిన దాఖలాలు లేవని గత బీఆర్ఎస్ చైర్‌పర్సన్‌పై కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసం పెట్టడం దానికి బీఆర్ఎస్ కౌన్సిలర్‌లే మద్దతు పలకడం విడ్డూరంగా ఉందని బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి విమర్శలు వ్యక్తం చేశారు. అవిశ్వాసం పెట్టి చైర్‌పర్సన్‌ను దింపినా మున్సిపల్‌లో అవినీతిలేని పాలన అందించడం కోసం మంచి చైర్‌పర్సన్‌ను ఎన్నుకునేందుకు ప్రతీ కౌన్సిలర్ సహకరించాలని అందరం కలిసి ప్రజలకు మేలైన సేవలు అందించేందుకు కృషిచేద్దామని పిలుపునిచ్చారు. అవసరమైతే 3పార్టీలలో అవినీతి మరకలు లేని అభ్యర్థిని కౌన్సిలర్‌లే నిలిపితే తన పార్టీ కౌన్సిల ర్‌ల మద్దతుతో పాటు తన మద్దతు ప్రకటిస్తానని బహిర ంగంగానే తెలిపారు. అయినా స్పందన లేక కాంగ్రెస్, బీఆర్ఎస్ దూకుడుకు కళ్లెం వేసేలా బీజేపీ నుంచి ఒకరు చైర్‌పర్సన్ రేసులో ఉండేలా పావులు కదిపేందుకు, అలా కుదరకపోతే బీఆర్ఎస్‌లో అవినీతి మచ్చలేని వారికి మద్దతు కసరత్తు చేస్తున్నారు.



డీసీసీబీ పాలకవర్గ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

దీర్ఘకాలిక రుణాల చెల్లింపునకు..
వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ పొడగింపు

● డీసీసీబీ సమావేశంలో నిర్ణయం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 12 : ఉమ్మడి జిల్లాలోని డీసీసీబీ బ్యాంక్ పరిధిలో దీర్ఘకాలిక రుణాల చెల్లింపు కోసం మరోమారు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్‌ను పొడిగించామని చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి తెలిపారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. బ్యాంకులో రుణాల వసూలు పూర్తిస్థాయిలో చేసేందుకు ఈ స్కీమ్‌ను ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు పొడగించినట్లు ఆయన తెలిపారు. ఈ దఫానే చివరి అవకాశమని తప్పనిసరిగా రుణాలు చెల్లించాలని ఆయన కోరారు. బ్యాంకు పరిధిలో ఉమ్మడి జిల్లాలో స్వల్పకాలిక రుణాలను వంద శాతం వసూలయ్యాయని ఆయన తెలిపారు. దీర్ఘకాలిక రుణాల వసూళ్లకే ఈ అవకాశాన్ని ఇచ్చామన్నారు. ఈ సమావేశం అనంతరం చైర్మన్‌ను ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులు సన్మానించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు పాల్గొన్నారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు

● ఏర్గట్లలో ఘటన ● ఒకరికి గాయాలు



ఏర్గట్లలో హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు

ఏర్గట్ల, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి బస్టాండ్ వద్ద గల ఓ హోటల్‌లోకి కారు ప్రమాదవశాత్తూ దూసుకెళ్లింది. ఈ ఘటనలో హోటల్ యజమాని ఎనుగందుల రవికి గాయాలయ్యాయి. దీంతో స్థానికులు అతన్ని వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గుమ్మిర్యాల్‌లో నీట మునిగి ఒకరి మృతి

ఏర్గట్ల, ఏప్రిల్ 12: మండలంలోని గుమ్మిర్యాల్ గోదావరి నదిలో నీటి మునిగి లవ్‌ప్రీత్ సింగ్ (19) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. లవ్‌ప్రీత్ సింగ్ హార్వెస్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడని చెప్పారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైసాకి పండుగ సందర్భంగా..
నిజామాబాద్‌లో ట్రాఫిక్ మళ్లింపు

● పోలీసు కమిషనర్ కల్మేశ్వర్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 12 :

సిక్కు సోదరుల బైసాకి పండుగ శనివారం నిర్వహిస్తున్న సందర్భంగా నిజామాబాదనిజామానినినిజామాబాద్ నగరంలో ట్రాఫిక్ మళ్లింపు చేసినట్లు పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5గంటలకు ఊరేగింపు పాముల బస్తీ కంఠేశ్వర్ రైల్వేకమాన్ గురుద్వార నుంచి ప్రారంభమై గాజుల్‌పేట్ గురుద్వారా వరకు రాత్రి 10గంటల వరకు చేరుకుంటుందని ఆయన తెలిపారు. రైల్వేకమాన్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, గాంధీచౌక్, పెద్దబజార్, లక్ష్మిమెడికల్ నుంచి గాజుల్‌పేట్ గురుద్వారాకు చేరుకుంటుందని తెలిపారు. కాబట్టి నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించి అత్యవసరంగా ఉన్న ప్రయాణాలను వేరే మార్గాల ద్వారా వెళ్లాలని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సూచించారు.



పూజలు చేస్తున్న హన్మాన్ భక్తులు

నియమ, నిష్టలతో హన్మాన్ భక్తుల దీక్ష

ధర్పల్లి ఏప్రిల్ 12: నియమ నిష్టాలతో హన్మాన్ భక్తులు మండల దీక్షను కొనసాగిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో హన్మాన్ భక్తులు భక్తి శ్రద్ధలతో దీక్షను చేపట్టారు. ఉదయం మూడు గంటలకే నిద్రలేచి స్నానం చేసి పూజలో నిమగ్నమయ్యారు. ఒకే పూట భోజనం చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తుంటారు. ఈనెల 23న జరిగే హన్మాన్ జయంతి సందర్భంగా దీక్షను విరమిస్తారు. హన్మన్ భక్తులు కాలినడకన కొండ గట్టుకు వెళ్ళి మాలను విరమిస్తారు. ప్రతీరోజు నియమ నిష్టాలతో పూజలను కొనసాగిస్తామని గురుస్వాములు కమ్మరి గంగాధర్, రెబ్బ నరేష్‌లు తెలిపారు. ఈనెల 17న జరిగే శ్రీరామ నవమికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రాముల వారి ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. రామ నవమి సందర్భంగా సీతరాముల కళ్యాణోత్సవం భక్తులు తరలి రావాలని కోరారు.

నేటి నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభం

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 12: మండలంలోని తొర్లికొండ గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయ జాతర ఉత్సవాలు శనివారం నుంచి 18 వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు తెలిపారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం జరుగుతాయని, 16న స్వామివారి కల్యాణోత్సవం, 17న స్వామివారి రథోత్సవం, 18న చక్రతీర్థం, స్వామివారి నాగవెళ్లి కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు తెలిపారు.

6వ తరగతిలో ప్రవేశాలకు ఆహ్వానం

ముప్కాల్, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని కస్తూర్బగాంధీ బాలికల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.వినోద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. పాఠశాలలో దరఖాస్తులు చేసుకునే వారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, బోనఫైడ్, కుల, ఆదాయ, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలతో పాటు ఫోటోలతో సంప్రదించాలని ఆమె సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్12: మున్సిపల్ పరిధిలోని శనివారం ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీధర్ తెలిపారు. 33కేవీ ఆర్మూర్ లైన్ దగ్గర ఉన్న చెట్ల కొమ్మల నరికివేత, ఇతర లైన్ మెయింటెనెన్స్ కారణంగా అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

డిచ్‌పల్లి: మండలంలోని ఖిల్లాడిచ్‌పల్లి, డిచ్‌పల్లి రైల్వేస్టేషన్, దూస్గాం గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల్లో చెట్ల కొమ్మలు తొలగించనున్న కారణంగా ఈనెల 13న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ శ్రీనివాస్, ఏఈ సాయిలు తెలిపారు. వినియోగదారులు, రైతులు ట్రాన్స్‌కో అధికారులకు సహకరించాలని కోరారు.



మోర్తాడ్‌లో రైతుల పాడి పశువులు

రైతులు పాడి పశువుల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి : పశు వైద్యాధికారి

మోర్తాడ్, ఏప్రిల్ 4: అధిక పాలు దిగుబడులు పొందడానికి అధిక పాలధార కలిగిన పాడి పశువులను ఎంపిక చేసుకొని పెంచడం ఎంతో అవసరమని, పాడి పశువుల్ని ఎంపిక చేసుకునే ముందు కొన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవాలని మండల పశువైద్యాధికారి గౌతంరాజ్ తెలిపారు. వాతావరణం, పరిస్థితులు పాలకి మార్కెట్‌లో ఉన్న గిరాకి, పశుగ్రాసాన్ని దృష్టిలో ఉంచుకొని సరైన ఎంపిక చేసుకోవాలని అధికంగా పాలనిచ్చే జెర్సీ సంకర జాతి ఆవులను ఎంపిక చేసుకోవాలని, దేశీవాలి, ఆవు జాతులలో ఒంగోలు, సింధి, గీర్ జాతులను ఎంపిక చేసుకోవాలి. గేదేల్లో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ముర్రా జాతిగేదే శ్రేష్ఠమైనది. అధిక పాల దిగుబడికి, అత్యధిక వెన్న శాతానికి పెట్టింది పేరు. జన్యు శాస్త్ర రీత్యా అధిక పాలను ఉత్పత్తి చేసే శక్తి పాడి పశువుల్లో ఉంటుంది. జన్యు కాణాలు లేని పశువులను ఎంత మెపినా పాల దిగుబడి అంతం మాత్రంగానే ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్న పాడి పశువులను మాత్రంమే ఎంపిక చేసుకోవాలని పశువుల ఎంపిక జరుగుతున్నప్పుడే అది సక్రమంంగా ఎదకు వస్తుందా? తెలుసుకోవాలి. పాడి ద్వారా ఎక్కువ ఆదాయం రావాలంటే ప్రతీ 14-15 నెలకు ఒకసారి ఈనెటట్లుండాలి. గాలికుంటు వ్యాధి సోకకుండా చూడాలి. దీంతో పాల దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఒకటి, రెండు ఈతల్లోనివి లెగ దూడతో సహ ఈనిన రెండు వారాల్లోగా కొనడం మంచిది. కనీసం రోజుకు 12-15లీటర్ల దిగుబడి ఇచ్చే పశువుని, రెండు పూటలా పాలను ఇచ్చేవి ఎంపిక చేసుకోవాలి. ఎక్కువ వయస్సు ఉన్న ఆవులను, గేదేలను ఎంపిక చేసుకోకూడదు. దంతాలను బట్టి పశువుల వయస్సును అంచనా వేయాలి. రెండు నుంచి ఆరు దంతాలున్న పశువులను ఎంపిక చేసుకోవాలి. అప్పుడే వాటి జీవితకాంలో ఎక్కువ ఈతలు పొందే అవకాశం ఉంది. చూడి పశువులను కొనకూడదు. ఆరోగ్యంగా చురుకుగా ఆడ లక్షణాలు, శాంత స్వభావం ఉన్న పశువులను ఎంపిక చేయాలి. కళ్లు పెద్దగా మెరుస్తూ ఉండాలి. శరీర బాగాలు పూర్తిగా వృద్ధి చెంది ఉండాలి. పాడి పశువులను ముందు నుంచి పక్క నుంచి వెనుక నుంచి చూసినప్పుడు త్రికోణాకారంగా ఉండాలి. ఇలాంటివి అధిక ఉత్పాధక సామర్థ్యం కలిగి ఉంటుంది. పాడి ఎంపికలో పొదుగుకు చాలా ప్రాముఖ్యత ఉంది. పొదుగుపై నాలుగు రొమ్ములు ఒకే పరిమాణంలో ఉండాలి. చన్నులు మరీ పొట్టిగా, మళ్లీ పొడవుగా ఉండకూడదు. రైతులు ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటే అధిక పాల దిగుబడి ఎక్కువగా ఉంటుందని ఆయన వివరించారు.

ఓటు ఆవశ్యకతపై ముగ్గుల పోటీలు

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్12: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం ఓటు ఆవశ్యకతపై ముగ్గుల పోటీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఎస్‌హెచ్‌జీ గ్రూప్ మహిళలతో ఓటు ఆవశ్యకతపై పోటీలు నిర్వహించి ఉత్తమ ముగ్గులు వేసిన వారికి కమిషనర్ రాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, సీవో రాజలింగం, ఆర్‌పీలు అన్నపూర్ణ, సత్య, గంగామణి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి జైలు

ఏర్గట్ల, ఏప్రిల్ 12: మండల పరిధి పోలీస్ స్టేషన్‌లో వాహనాల తనిఖీలో భాగంగా మద్యం తాగి వాహనాలు నడిపిన ఏర్గట్లకు చెందిన కోల రాజేష్ గౌడ్, నిర్మల్‌కు చెందిన బోదన్‌కడ్ శ్రీనివాస్‌లకు రెండు రోజుల జైలు శిక్షను ఆర్మూర్ కోర్టు విధించినట్లు ఏర్గట్ల ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. అలాగే రెండవ సారి మద్యం సేవించిన బట్టాపూర్‌కు చెందిన భూపనవేణి నర్సయ్య, మెట్‌పల్లికి చెందిన విజయ్ దేష్ముక్‌లకు 10 వేల రూపాయల జరిమానాను విధించినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

3వ వార్డులో క్రికెట్ కిట్ల పంపిణీ

ఆర్మూర్ టౌన్ , ఏప్రిల్ 12: మున్సిపల్ పరిధిలోని హౌజింగ్‌బోర్డు 3వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య శ్రీనివాస్, కౌన్సిలర్ వరలక్ష్మీ లింబాద్రిగౌడ్‌లు శుక్రవారం క్రికెట్ కిట్‌లు, వాలీబాల్ కిట్‌లు పంపిణీ చేశారు. హౌజింగ్ బోర్డులోని కింగ్స్ యూత్, శ్రీవిష్ణుయూత్ సభ్యులకు క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండారి సాల ప్రసాద్, యువకులు పాల్గొన్నారు.

అటకెక్కిన వ్యవసాయ యంత్రాలపై రాయితీ

● జిల్లాలలో రైతులకు అందని సబ్సిడీ వ్యవసాయ రంగ యంత్రాలు, పరికరాలు ● కొన్నేళ్లుగా సబ్సిడీకి దూరమవుతున్న రైతులు ● రైతులకు భారంగా మారిన వ్యవసాయం

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 12: అన్ని రంగాలలో మార్పులు వచ్చిన విధంగానే వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. వ్యవసాయంలో రైతులకు సబ్సిడీపై గతంలో అనేక పరికరాలు, యంత్రాలు అందజేసేవారు. దీంతో రైతులు ఎంతో సంతోషించారు. ఆ సంతోషం కాస్త మున్నాళ్లముచ్చటే అయ్యింది. ఆధునిక వ్యవసాయంలో యంత్రాల ప్రవేశంతో వ్యవసాయ రంగానికి మంచి రోజులు వచ్చాయని రైతులు మురిసిపోయారు. కానీ గత కొన్నేళ్లుగా ప్రభుత్వం సబ్సిడీపై ఎలాంటి యంత్రాలు, పరికరాలు అందజేయడంలేదు. సబ్సిడీపై యంత్రాలు అందజేస్తే వ్యవసాయంలో రైతులకు ఎంతగానో ప్రయోజకరంగా ఉంటుంది. యంత్రాల వినియోగంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు, తక్కువ సమయంలో పనులు పూర్తి అవ్వడమే గాకుండా వ్యవసాయం లాభసాటిగా ఉంటుంది. గతంతో వ్యవసాయానికి సబ్సిడీ యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేసింది. రోటోవేటర్‌పై 50శాతం సబ్సిడీ, పిచికారి పరికరాలు 33 శాతం సబ్సిడీతో రైతులకు అందజేసేవారు. 2018 వరకు సబ్సిడీ కొనసాగింది. కొంత కాలంగా ఈ పథకం అటకెక్కింది. వ్యవసాయానికి ఏ పరికరం కూడా సబ్సిడీపై జిల్లాలోని రైతులకు అందడం లేదు. గతంలో కూరగాయ విత్తనాలతో పాటు ట్రాక్టర్‌లు, స్ప్రే పంపులు, కలుపుతీసే యంత్రాలు, వరి కోత మిషన్‌లు, టార్పలిన్ కవర్‌లు సబ్సిడీపై ఇచ్చేవారు..



యంత్రం సాయంతో ఎర్రజొన్న పంట కోపిస్తున్న రైతులు

● కూలీల కొరతను అధిగమించవచ్చు

వ్యవసాయ పనుల్లో యంత్రాలు వినియోగించడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేసే వీలుంటుంది. విత్తనాలు వేయడం మొదలు నుంచి పంట కోత వరకు అన్ని పనులు యంత్రాల వల్ల చేయడంతో సమయం ఆదా అవుతుంది. అంతేగాక కూలీల కొరతను అధిగమించవచ్చు. గ్రామాలలో వ్యవసాయ పనులకు కూలీలు లభించక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. అందుబాటులో ఉన్న కొద్ది మంది పనులకు వచ్చిన డిమాండ్ ఉండడంతో కూలీల చెల్లింపులో రైతులపై అధిక భారం పడుతుంది. ఇప్పటికే రైతులు యంత్రీకరణపై ఆధారపడి ఉన్నారు. వరి పంటకు చేతికొచ్చే సమయంలో కూలీలు లభించక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరి కోత యంత్రాలు కొనుగోలు చేయడం రైతులకు భారమవుతుంది. వరి కోత యంత్రాలు అద్దెకు తీసుకొని పనులు వెల్లదీస్తున్నారు. ప్రభుత్వం యంత్ర పరికరాలు, వరికోత యంత్రాలను సబ్సిడీపై అందిస్తే రైతుల ఇబ్బందులు దూరమవుతాయి అంటున్నారు.

● అందుబాటులో లేని వరినాటు యంత్రాలు

రైతులకు వరినాట్లు వేసే యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో కూలీలపై ఆధారపడాల్సి వస్తుంది. గ్రామాల్లో సైతం పొలం పనులకు కూలీలు లభించక వరినాట్లు వేసే పనులకు ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలే ఆసరా అవుతున్నారు. జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వస్తున్న కూలీలచే రైతులు నాట్లు వేయిస్తున్నారు. వరినాట్లు యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తే రైతులకు ఎంతో ప్రయోజనకంగా ఉంటుంది.

● రైతులకు పెట్టుబడి ఆదాకు అవకాశం

సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందజేస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి డబ్బులు ఆదా అవుతాయి. రోటోవేటర్ లాంటి పరికరాల వినియోగంతో భూమి గుల్లాగా మారి సారవంతమవుతుంది. పిచికారి పరికరాలు (స్ప్రే) పంపులు రాయితీ ఇవ్వడం వల్ల రైతులకు లాభం చేకూరుతుంది. సీడ్‌కం ఫర్టిలైజర్, డ్రీల్ వినియోగం ద్వారా విత్తనమోతాదు, ఎరువులు మోతాదు ఆదా అయి రైతులకు బహువిధ లాభాలు చేకూరుతాయి. దీని వల్ల వ్యవసాయ పెట్టుబడి ఖర్చు తగ్గించి.. రైతులకు నికర ఆదాయం పెంచడానికి వీలు కలుగుతుంది.



వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన కొన్ని యంత్ర పరికరాలు

మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు

● జిల్లా ఆరోగ్య విద్య బోధకులు, కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు

ఆర్మూర్ టౌన్ ఏప్రిల్ 12: పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్కూల్ అండ్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య విద్య బోధకులు, జిల్లా కోఆర్డినేటర్ మాన్పూర్ వెంకటేశ్వర్‌లు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అనేక రకాలైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, నాలుగు రకాలుగా మానసిక ఒత్తిడిలు ఉంటాయన్నారు. మానసికంగా బలహీనులైన కొందరు క్షణికావేశంలో ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని, స్థానికుల దృక్పథంతో చక్కని ప్రణాళికతో మానసిక ధైర్యంతో ప్రతీరోజు చదువుకుంటూ తనపై తనకు నమ్మకం పెంచుకున్నప్పుడు ఒత్తిడికి గురికాకుండా అనుకూన్న లక్ష్యంకు చేరుకుంటారని, శరీరక వ్యాయం, ఆటలు, మెడిటేషన్ చేస్తూ మానసిక ప్రశాంతతను పొందాలన్నారు. ఇందులో ఇన్‌చార్జీ వైస్ ప్రిన్సిపాల్ భువనేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, ఉపాధ్యాయులు స్వప్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ మాన్పూర్ వెంకటేశ్వర్లు

గురుకుల డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో మానసిక ఒత్తిడి ఉపశమనంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోను కాకుండా వ్యయామం, ధ్యానం చేస్తూ పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలని, నీరు తాగడం వల్ల ఒత్తిడి నుంచి విముక్తి పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ హెల్త్ ఎడ్యుకేటర్ జి.స్వామిసులోచన, మానసిక వైద్యుడు రంజిత్, అనురాధ, ప్రిన్సిపాల్ ధణవేణి, సంతోషి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలి

● రైతాంగానికి మద్దతు ధర చెల్లించాలి : దినేష్‌కుమార్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 12: జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరిస్తున్న వరిధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం చేయకుండా కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో ఛాయ్‌పై చర్చ కార్యక్రమంలో భాగంగా వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు ఆరబోసుకున్న వరిధాన్యాన్ని ఆయన పరిశీలించారు. రైతులకు ప్రస్తుతం అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోకుండా ఉన్న ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేసి రైతుల ఖాతాలో డబ్బులు జమచేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం మిట్టపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి కూలీ వందరోజుల పని పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. కూలీలు చేస్తున్న పనుల వివరాలు, కూలీ డబ్బుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం రైతులతో కూడా కొనుగోళ్లపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ గద్దెభూమన్న, మండల పార్టీ అధ్యక్షుడు యాదగిరి వెంకటరమణ, పార్టీ ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శివారెడ్డి, లక్ష్మణ్, శ్రీను, ప్రదీప్, విఠల్, అబ్బులు, బాలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



మిట్టపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న దినేష్‌కుమార్



ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో వరిధాన్యం పరిశీలిస్తూ..

కాంగ్రెస్ పార్టీలోకి తెలంగాణ జాన జాగృతి సమితి పార్టీ వ్యవస్థాపకుడు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 12: తెలంగాణ జాన జాగృతి సమితి పార్టీ వ్యవస్థాపకుడు సుంకె శ్రీనివాస్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి ఆయనకు కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ జనజాగృతి సమితి పార్టీని త్వరలోనే హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తామని సుంకె శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, మంతెన శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలోకి కండువా వేసి ఆహ్వానిస్తున్న దృశ్యం



రైతులతో మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి

'వేసవిలో పశువుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి'

మాక్లూర్ , ఏప్రిల్ 12: వేసవిలో రైతులు పశువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దీంతో పశువులు అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందని జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గుంజలి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గ్రామంలో జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పశువులకు ఏలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో రైతులకు అవగాహన కల్పిస్తూ ఉండాలని సిబ్బందికి సూచించారు. మొత్తం 344 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశామని తెలిపారు. ఇందులో పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్‌దేశ్‌పాండే, పశువైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహిళా మోర్చా అధ్యక్షురాలిగా స్రవంతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 12: డిచ్‌పల్లి మండల మహిళామోర్చ అధ్యక్షురాలిగా యానంపల్లికి చెందిన స్రవంతిని శుక్రవారం నియమించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని జిల్లా పార్టీ అధ్యక్షుడు దినేష్‌కుమార్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను మండల మహిళలకు వివరించి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ గెలుపు కోసం తప్పక సహకారం అందిస్తానని స్రవంతి పేర్కొన్నారు. ఇందులో జిల్లా పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, మండల అధ్యక్షుడు వెంకటరమణ, పార్టీ ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 19మందికి జైలు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 12: ఆర్మూర్ సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన 244 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో శుక్రవారం ఆర్మూర్ కోర్టు ఇన్‌చార్జీ న్యాయమూర్తి 19మందికి జైలు శిక్ష విధించినట్టు ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. ఈ కేసులో మిగతా వారికి రూ.4లక్షల 43వేలు జరిమానా విధించారన్నారు. ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 34కేసులకు గాను నలుగురికి జైలు శిక్ష మిగత వారికి రూ.67వేల 500జరిమానా, బాల్కొండ పరిధిలో 21కేసులో రూ.41వేల 500 జరిమానా, నందిపేట పరిధిలో 21కేసులో రూ.38వేల 500 జరిమానా, వేల్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 18 కేసులలో రూ.38 వేల జరిమానా, మెండోరలో 29 కేసులలో ఐదుగురికి జైలు శిక్ష, మిగతా వారికి రూ.68వేల జరిమానా, ముప్కాల్‌లో 11కేసులలో ఒకరికి జైలు శిక్ష మిగతా వారికి రూ.23వేల 500జరిమానా, భీమ్‌గల్‌లో 26కేసులకు గాను ముగ్గురికి జైలు శిక్ష, రూ.44వేల జరిమానా, కమ్మర్‌పల్లి పరిధిలో 28 కేసులకు గాను నలుగురికి జైలు శిక్ష మిగతా వారికి రూ.45వేల 500 జరిమానా, ఏర్గట్ల పరిధిలో 31 కేసులకు గాను ఇద్దరికి జైలు శిక్ష మిగతా వారికి రూ.55 వేల జరిమానా, మోర్తాడ్ పరిధిలో 25 కేసులకు గాను రూ.29 వేల 500జరిమానా విధించినట్టు ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు.

కమ్మర్‌పల్లి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆర్మూర్ ఇన్‌చార్జ్ న్యాయవాది శుక్రవారం నలుగురికి రెండు రోజుల జైలుశిక్ష విదించినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ తెలిపారు. కమ్మర్‌పల్లికి చెందిన నలుగురువ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపర్చగా.. ఈ శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

కలిగోట్‌లో చెరువులో పడి ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 12: మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన పుసవెర్ల శేఖర్(32) చెరువులో పడి మృతి చెందినట్టు ఎస్సై సిహెచ్.తిరుపతి తెలిపారు. ఎస్సై సిహెచ్.తిరుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కలిగోట్ గ్రామానికి చెందిన పుసవర్ల శేఖర్ గురువారం మధ్యాహ్నం గ్రామంలోని కుమ్మరికుంట చెరువులోకి వెళ్లి చేపలు పడుతుండగా.. చెరువులో ఉన్న వలకు ప్రమాదవశాత్తు చిక్కుకొని చెరువలో మునిగిపోయాడని ఎస్సై తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం చెరువులో మృతదేహం తేలగా శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. మృతుడు కూలీ పనులు చేసుకుంటాడని ఎస్సై తెలిపారు. మృతుడు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



రాజంపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

• ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

తాడ్వాయి, ఏప్రిల్12: జహీరాబాద్ కాంగ్రెస్‌పార్టీ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం తాడ్వాయి మండల కేంద్రంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్‌పార్టీ తరఫున పోటీచేసి గెలుపొందిన ఎంపీ బీబీపాటిల్ బీఆర్ఎస్ పార్టీని మార్చి ప్రస్తుతం బీజేపీనుంచి పోటీ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి వ్యక్తికి ప్రజలు గట్టి గుణపాఠం చెప్పి నియోజకవర్గం నుంచి సాగనంపాలని అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ అందించేలా కార్యకర్తలు కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, జంగం రాజు, శ్యామ్‌రావు, చౌకతలి కిష్టారెడ్డి, జలంధర్‌రెడ్డి, పులిబాబు, భూషణం తదితరులు పాల్గొన్నారు.

• కార్యకర్తల అండతోనే ప్రభుత్వం ఏర్పడింది..

రాజంపేట: కార్యకర్తల అండతోనే ప్రభుత్వం ఏర్పడిందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని బస్వన్నపల్లిరెడ్డి సంఘంలో నిర్వహించిన మండల, గ్రామ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయి కార్యకర్తలతోనే తాను ఎమ్మెల్యేగా గెలిచానని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జహిరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజారీతో గెలిపించాలన్నారు. రాబోయే రోజుల్లో అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ తోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, యూత్ అధ్యక్షులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తాగునీటి వాటర్ ప్లాంట్ ప్రారంభం

గాంధారి, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజన కోరిక మేరకు శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు మంచినీటిని అందించాలనే ఉద్దేశ్యంతో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్‌నాయక్, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయికుమార్, మాజీ సర్పంచ్ సంజీవ్‌యాదవ్, బలరాంనాయక్, నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్ష స్వాములకు భిక్ష ఏర్పాటు చేసిన ముస్లిం సోదరులు



భిక్షలో పాల్గొన్న హనుమాన్ మాలధారులు

ఎల్లారెడ్డి, ఏప్రిల్12: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు గండిమాసానిపేట్‌లో హనుమాన్ మందిరంలో హనుమాన్ స్వాములకు ముస్లిం స్లీం సోదరులు ముఖీద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి వహీద్ శుక్రవారం హనుమాన్ మాలధారణ స్వాములకు తమ తరఫున భిక్ష (భో జనం) ఏర్పాటు చేసి మత సామరస్యం చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అందరూ కలిసిమెలిసి ఉండాలని అన్నా రు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థి వ్యతిరేకవిధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలి

• ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్12: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో ఏర్పాటుచేసిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకొచ్చి విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేట్, కార్పోరేట్‌కు అప్పజెప్పాలనే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం 7వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్, పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయకపోవడం సరైందికాదని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, నాయకులు అజయ్, మణికంఠ, సాయిసాగర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్నఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్



ఎల్లారెడ్డిలో వడ్డీ వ్యాపారులపై పోలీసుల దాడులు దృశ్యం



బీర్కూర్‌లో వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసులు

వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో సోదాలు

• జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు • పలు కీలక పత్రాలు, ప్రామిసరీ నోట్లు, చెక్కుల స్వాధీనం

బీర్కూర్, ఏప్రిల్12: మండల కేంద్రంలోని వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో దాడులు నిర్వహించి సోదాలు చేశారు. వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించి, ప్రామిసరీ నోట్లు, చెక్కులు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ అధిక వడ్డీ వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు రావడంతో వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. బీర్కూర్‌లో ఇద్దరి ఇళ్లల్లో తనిఖీలు చేయగా.. గోపి మహాజన్ ఇంట్లో రూ.5లక్షల 63వేల వడ్డీకి ఇచ్చిన 21 ప్రామిసరీ నోటు పత్రాలు, లక్షా 47వేలు విలువైన రెండు చెక్కులు లభించాయని, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు. అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తున్న గోపిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

• ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అధిక వడ్డీలతో వ్యాపారం చేస్తున్న వ్యాపారుల ఇళ్లల్లో దాడులు చేసి పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ తెలిపారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని రాచకొండ రామకృష్ణ అనే వడ్డీ వ్యాపారిపై దాడులు చేయగా అతని వద్ద ఉన్న 15 ఖాళీ చెక్కులను, ఒక ప్రామిసరీ నోట్, భూమికి సంబంధించిన ఒక సెల్ లీడ్ స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయనతో పాటు ఏఎస్ఐ సిద్దికి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• బాన్సువాడలో పది మంది వ్యాపారుల ఇళ్లలో..

బాన్సువాడ: పట్టణంలోని పదిమంది వడ్డీ వ్యాపారులఇళ్లల్లో శుక్రవారం పట్టణ సీఐ క్రిష్ణ ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో పట్టణానికి చెందిన వడ్డీ వ్యాపారులైన పాలకుర్తి విఠల్, చిదుర రజేందర్ గుప్తా, దేవేందర్ వడ్డీ వ్యాపారస్తుల నుంచి ప్రామిసరీ నోట్లు, చెక్కులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. పాలకుర్తి విఠల్ నుంచి 8 ప్రామిసరీ నోట్లు, చెక్కులు, రాజేందర్ గుప్తా నుంచి 40 ప్రామిసరీ నోట్లు చెక్కులు, దేవేందర్ నుంచి 75 ప్రామిసరీ నోట్లు, చెక్కులను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ క్రిష్ణ తెలిపారు. అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారుల పైనా, సెల్ డీడీ చేసుకునే వ్యాపారస్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. త్వరలోనే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

• భిక్కనూరులో పోలీసుల తనిఖీలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఏడు ప్రైవేటు ఫైనాన్స్‌లో భిక్కనూరు ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండల కేంద్రంలో అనుమతులు లేకుండా జీరో ఫైనాన్స్‌లను నడుపుతున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఏడు ఫైనాన్స్‌లలో తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. భిక్కనూరుకు చెందిన కోడిప్యాక వెంకటేషం, మురికి రాజేశం ఫైనాన్స్‌లలో ప్రామిసరీ నోట్లను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందన్నారు. ఫైనాన్స్ నడిపే వారు తప్పకుండా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాలని, ఎక్కువ వడ్డీలు వసూళ్లు చేయొద్దన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



పత్రాలను పరిశీలిస్తున్న దృశ్యం



భిక్కనూరులో ఫైనాన్స్‌లలో తనిఖీ చేస్తున్న పోలీసులు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

• అదనపు కలెక్టర్ చంద్రమోహన్

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 12: మండలంలోని అడవి లింగాల గండిమాసానిపేట్, ఎల్లారెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ చంద్రమోహన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు సౌకర్యం కల్పించాలని కొనుగోలు వేగవంతం చేయాలని, లారీల విషయంలో ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులకు తెలిపారు. ఆయనతో పాటు డీటీ సురేష్, సొసైటీ కార్యదర్శి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై విద్యార్థులకు అవగాహన



సమాచార హక్కు చట్టం గురించి వివరిస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, ఏప్రిల్12: పట్టణకేంద్రంలోని కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం ప్రతీఒక్కరికి ఆయుధం లాంటిదని, ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని వివరించారు. అనంతరం అలాగే విద్యాహక్కు చట్టంపై కూడా పలు విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈసీ మెంబర్ లింగమయ్య, మదర్ పాషా, ఇంతియాజ్, ప్రభాకర్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైకు ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

తాడ్వాయి, ఏప్రిల్ 12: గాంధారిలో శుక్రవారం నిర్వహించిన బైక్ ర్యాలీలో తాడ్వాయి మండలం నుంచి బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేస్తామని తెలిపారు. మళ్లీ కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ బాణాల లక్ష్మారెడ్డి, వెంకట్‌రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు వద్ద ఆటో బోల్తా: ఇద్దరికి గాయాలు

భిక్కనూరు, ఏప్రిల్ 12: ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ఇద్దరు గాయపడిన సంఘటన భిక్కనూరు మండల కేంద్రంలోని 44వ జాతీయరహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డికి చెందిన ఎరుకల రాజు, అతడి స్నేహితుడు అవినాష్‌తో కలిసి ఆటోలో మెదక్ జిల్లా రామాయంపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా భిక్కనూరు సమీపంలో ముందు వెళ్తున్న లారీ ఒక్కసారిగా సడెన్ బ్రేక్ వేయ్యడంతో అప్రమత్తమైన ఆటో నడుపుతున్న రాజు ఆటోకు కూడా సడేన్ బ్రేక్ వేశాడు. దింతో ప్రమాదవశాత్తు ఆటో రోడ్డు పక్కకు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రాజు, అతడి స్నేహితుడు అవినాష్‌కు గాయాలు కాగా అంబులెన్స్ వాహనంలో వారిరువురిని చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించారు.



గాయపడ్డ వ్యక్తిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ముత్యాలమ్మకు బోనాలు

గాంధారి, ఏప్రిల్12: గాంధారి మండలంలోని గండివేట్ గ్రామంలో ముత్యాలమ్మకు గ్రామస్థులు బోనాలు తీశారు. ఈ సందర్భంగా ఊరిలోని ప్రజలంతా ప్రధాన వీధుల గుండా బోనాలను ఊరేగించి అమ్మవారికి బోనాలను సమర్పించారు. అందరిని చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో అన్నికుల సంఘాల పెద్దలు, ప్రజాప్రతనిధులు తదితరులు పాల్గొన్నారు.



బోనాలను ఊరేగిస్తున్న గ్రామస్థులు



సమావేశంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంపీపీ

'బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి'

రామారెడ్డి, ఏప్రిల్12: బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలుపు కోసం ప్రతీఒక్కరు కృషిచేయాలని రామారెడ్డి ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి కార్యకర్తలను కోరారు. శుక్రవారం రెడ్డిపేట గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దిన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, రాజాగౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం

సదాశివనగర్, ఏప్రిల్ 12: మండలంలోని అమర్లబండలో పెద్దమ్మఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బోనాలు అలంకరించుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తు ఆలయం వద్దకు ఆటపాటలతో డప్పు వాయిద్యాలతో బోనాలను తీసుకువచ్చారు. ఆలయంలోని అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.



అమర్లబండలో బోనాల ఉరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

డెడ్ స్టోరేజీకి చేరిన పోచారం ప్రాజెక్టు!

• అడుగంటిపోతున్న నీరు



ప్రాజెక్టులో తగ్గిపోయిన నీరు

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 12 : నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాలకు వరప్రదాయిని అయిన పోచారం ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి మట్టం పూర్తిగా అడుగంటి పోయి డెడ్ స్టోరేజ్‌కు చేరింది. పోచారం ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 1464 అడుగులు (1.820 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 0.156 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ సారి ఖరీఫ్, రబీ రెండు పంటల సాగుకు ప్రాజెక్టు ద్వారా నీటి పారుదల శాఖ అధికారులు నీటిని అందించారు. గత వర్షాకాలంలో పుష్కలంగా నీరు కురవడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. వర్షాకాలంలో నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన అధికారిక లెక్కల ప్రకారం 10,500 ఎకరాలకు సాగు నీరందించగా, అనధికారిక లెక్కల ప్రకారం సుమారు 17 వేల ఎకరాలకు ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందించారు. అలాగే రబీ సీజన్‌లోనూ ప్రాజెక్టు పరిధిలోని బి జోన్‌కు చెందిన ఎల్లారెడ్డి మండలంలోని సాగు భూములకు ప్రాజెక్టు ద్వారా నీరు అందించారు. ప్రస్తుతం యాసంగి పంటలన్నీ చేతికి వచ్చాయి. పంటలు చేతికి రావడంతోనే, ప్రాజెక్టులోని నీరు పూర్తిగా అడుగంటి పోవడం జరిగింది. యాసంగి పంటల సాగు కోసం ప్రాజెక్టు ద్వారా నాలుగు విడతలుగా నీటి పారుదల శాఖ అధికారులు నీటిని అందించారు. ప్రాజెక్టులో కొద్దిపాటి నీరు ఉండగా నాగిరెడ్డిపేట మండలం కేంద్రంలో ఉగాది సందర్భంగా జరిగిన నల్ల పోచమ్మ జాతర ఉత్సవాల కోసం భక్తులకు స్నానాల సౌకర్యం కోసం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటిని వదిలి భక్తులకు నీటి సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిగా అడుగంటి పోయింది. రానున్న వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురిస్తే గాని ప్రాజెక్టులోకి నీరు వచ్చే అవకాశం లేదు.

'రైతులకు కష్టాలు తెచ్చిపెట్టిన 22వ ప్యాకేజీ పనులు'

సదాశివనగర్, ఏప్రిల్ 12: రైతులకు ఆశలు రేకెత్తించిన బొంపల్లి రిజర్వాయర్ 22వ ప్యాకేజీ పనులు పూర్తిచేయకపోవడంతో అనేక కష్టాలు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. శుక్రవారం కాలువ నిర్మాణంతో ఏర్పడిన ఇబ్బం దులపై రైతులు క్షేత్రస్థాయిలోకి పరిశీలించడంతో పాటు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొంపల్లి నుంచి వెళ్లే ఫార్మేషన్ రోడ్డు వందలాది మంది రైతులకు పంట పొలాలకు వెళ్లడానికి వీలుగా ఉండేదని, బొంపల్లి రిజర్వాయర్ అలుగు నిర్మాణం చేపట్టడం మధ్యలోనే వదిలేయడంతో అలుగునీరు పంటచేన్లకు నష్టం చేస్తూ వెళ్తోందని రైతులు వాపోయారు. 2019లో భూసేకరణ నిర్వహించినప్పటికి ఇంతవరకు పనులు పూర్తి చేయకపోవడంతో అలుగునీరు తమకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాలకు ఏవైనా వస్తువులు, ఎరువులు తీసుకెళ్లాలంటే మూడు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కలెక్టర్ కాలువను సత్వరమే పరిశీలించి రోడ్డును సరిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు సాయిరెడ్డి, సతీష్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.



అసంపూర్తి ఉన్న పనులను చూపుతున్న రైతులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	- లవ్‌గురు
శాంతి	- టిల్లు స్క్వేర్
ప్రియా 70	- ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35	- గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ	
మహేశ్వరి	- ది ఫ్యామిలీ స్టార్
వెంకటేశ్వర	- లవ్‌గురు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	180	200	220
వెన్‌కాబ్(కిలో)	:	190	220	230

